చిట్కా

కనకవల్లి

ఆ కాలనీలో ఎవరికి కాలక్షేపం కావాలన్నా, తీరుబడిలావున్నై, తోచకున్నా, అవ్వగారి దగ్గరకు వచ్చేవారు. గంటలు క్షణాల్లా గడిచే టట్టు చెయ్యగలశక్తి అవ్వగారి కబుర్లకున్నది అవ్వగారు గ్రాడ్యుయేటూ, గొప్ప రచయిత్రీ కాదుగాని మంచి సంభాషణా చాతుర్యమున్న మనిషి. తన కాలంనాటి కబుర్లు వినేవారికి ఆ ఆసక్తి కలిగించేట్టు ఎంత అందంగా కథల్లా మలిచి చెప్పేదనీ. గంటల తరబడి చెప్పేది.

''పన్నెండేళ్ల వయసు. అందులో ఇప్పట్లా బుడబుడక్కల పెండ్లా. మహారాజు రోజుల కదూ ఆ రోజులు. ఎన్ని నగలు ఎన్నిచీరలు పాతికసవర్ల కాసులపేరు. ముప్ఫై కాసుల వడ్డాణం. పన్నెండు కాసుల గజ్జెల ఎట్టెడ.'' ఇప్పటికే వింటున్న శ్రోతలకు వళ్లు గగుర్పొడిచేస్తది.

ఇంకా ఏం వినగలరు, ముప్ఫై కాసుల ఒడ్డాణం. వళ్లంతానేగాదు, ఇల్లంతా వూడ్చి నేలం వేసినా ఈ కాలంలో ఈ మధ్యతరగతి కాపరాల్లో ఎవరిదగ్గరున్నదంత బంగారం. మూడేండ్ల కింద పక్షవాతంతో మంచాన పడ్డప్పటినుంచీ సుబ్బమ్మవ్వ హరికథ ఇది. రోజు కోసారైనా తల్చుకుంటుందా యిల్లాలు. మిగిల్న అన్ని కబుర్లూ మామూలుగా నవ్వుతూ చెప్పే సుబ్బమ్మవ్వకు తన పెండ్లి, ఆ నగలు, ఆ వైభవం, ఆ వేడుకలూ తల్చుకుంటే పల్నాటి వీరచరిత్రలో బాల చంద్రుని యుద్ధ ఘట్టం వర్ణించే బుర్రకథ వాండ్లలా వళ్లు పరవశ మయ్యేది.

''అంతేనా. బారెడు బంగారు జడ కూచుంటే నేలతాకేది జడ...''

''మరిప్పుడానగలన్నీ ఏమైనాయవ్వగారూ'' వింటున్న శ్రోతల్లో ఒకావిడకు నోరువూరుకోదు మరి ఆరా తియ్యందే. అందులో ఇది బంగారం విషయం.

''అయ్యో తల్లీ ఇంకా యెక్కడున్నదే అమ్మా. రెక్కలొచ్చి అంతా ఎగిరిపోయింది. సామాన్యమా అమ్మా! ముగ్గురు కూతుండ్ల పెండ్లిండ్లు చేశాను. తలోనాల్గు పురుళ్లూ పోశాను. ముగ్గురు కొడుకుల చదువులాయె. కోడండ్లకు తలో పది కాసుల బంగారం పెడ్తినాయె. మాటలా అమ్మా పిల్లలుగల కాపరమాయె. అంతా ముగిసిపోయింది. ఇక మిగిలిందొకే ఒకటి. ముప్ఫై కాసుల ఒడ్డాణం''

శ్రోతలందరూ వులికిపడేవారు. ముప్ఫై కాసుల ఒడ్డాణం. ఎంత లేదన్నా ఈ ధరల్లో అందులో పాతకాలపు నగ. మంచి బంగారం. ఎంతవుతుందో!

''ఎక్కడున్నది మామ్మగారూ'' అడగ్గానే సుబ్బమ్మవ్వ బోసినవ్వు నవ్వేది.

''బాంకీలో వేశానే అమ్మా. ఇంట్లో ఎలా

వుంచటం. అసలే పిదపకాలం'' నిజమేమరి. పట్టపగలే ఇండ్లల్లో జొరబడి దోచుకుపోతున్న ఈ పాడు రోజుల్లో, అంత బంగారం ఇంట్లో వుంచుకోవటం అవివేకమే.

''ఎవరికిస్తారో మామ్మగారు చివరికది'' అనేవారందరూ నవ్వుతూనే.

''ఎవరికో ఎందుకిస్తానే అమ్మా. నా వాండ్లకే. నా పిల్లలకే. ఎవరీ కట్టెకింత గంజి పోసి, ఏగి, ఎత్తిపోస్తారో వాండ్లకే యిస్తాను. పైవాండ్ల కెందుకిస్తానమ్మా''

అవ్వగారు చెప్పింది బాగానే వున్నది వినటానికికాని, ఆ నా అనే వాండ్లెవరూ అని. ముగ్గురు కోడండ్లున్నారు చాకిరీ చేస్తూ. ఎవరికిస్తుందో ముసల్ది.. అందులో అచ్చం కోడండ్లే కాదాయె, ఆడపిల్లలున్నారు ముగ్గురు. ఆడప్రాణం. తల్లి సొమ్ము తలో కొంచెమన్న దంటె...ఇంత చాకిరీ దండగే అయిపోదూ మరి.

ఈ అనుమానంతోనే ముగ్గురుకోడండ్లూ తామడగటం భావ్యం కాదని, ఒకవేళ అడిగినా ముసల్ది మనసులో మాట బయటకు రానివ్వదని తెలుసుగనక బాగా మొహమాటస్థుల ద్వారా అవ్వగారు మూడ్‌లో వున్నప్పుడు లాలనగా అడిగించారు కూడానూ... ఆ ఆడపిల్లలున్నారు నిజమేగాని ఇవ్వనే తల్లీ. ఇచ్చేదంతా ఇప్పటికే యిచ్చాను. ఇన్నాళ్ళన్నాని. అనుమూ అక్కరా చూచాను. ఇహ వాండ్ల కిచ్చేదేంలేదు. కొడుకు లకూ ఆడపిల్లలున్నారా. చిన్నా చితకా అంతా పైజువారీగా ఎదిగేవస్తున్నారా. వాండ్లుమాత్రం పరాయివాండ్లా అమ్మా. వాండ్లకే ఆ కాస్తా....

అమ్మయ్య, కోడండ్ల ప్రాణాలిప్పటికి కుదుటబడ్డాయిగాని, ముగ్గురు కోడండ్లలో ఎవరికిస్తుందీ అని. అది తేలాలి ముందు. కోడండ్లు వంతులు వేసుకుని చెయ్యసాగారు అత్తగారి పరిచర్య. అవ్వగారు గుట్టుమనిషి, గట్టిమనిషి కూడానూ. ఇంత బంగారం వంటిన వున్నప్పుడూ ఎవర్నీ తాకనివ్వలేదు. అమ్మినప్పుడూ ఎవరికీ తెలియనివ్వలేదు. అలాగే ఎంత వున్నదో? ఎంత ఖర్చయిందో? నరుడన్నవాడెరక్కుండా జరక్కొచ్చిందిన్నాళ్ళూ కాదు. ఇన్నేండ్లూ. ఆమె చేత్తో ఆమె ఇచ్చిందే దక్కుడు కూతుండ్లకైనా, కోడండ్లకైనా. కూతుండ్లకేమోగాని కోడండ్ల కిది లోలోపల మంటగానే వుండేది. ''తగని బంగారం వుండేదిటగా మీ అమ్మగారి వంటి మీదా ఏదీ కనిపించదేం. ఏం చేసిందంతా...'' కాపరాని కొచ్చిన కొత్తల్లోనే ప్రతి కోడలూ భర్తను వేసిన మొట్టమొదటి ప్రశ్న యిదే. కాపీ కొడ్తున్న విద్యార్థుల్లా ముగ్గురన్నదమ్ములూ ఒకటే మాట... ఏమో అవన్నీ ఎవరికి తెలుసు. ఆడదాని వంటిమీద, అందులో అమ్మ వంటిమీద బంగారంతో మాకేం పని. అయినా కాకున్నా మా పసితనంలోనే ఏ బాధ్యతలూ తీరకుండానే పోయినాడాయె నాన్న. అమ్మే అన్నిటికీ దిక్కయింది. మా ముగ్గురన్నదమ్ముల చదువులు, మా ఆర్గురి పెండ్లిండ్లు అన్నీ ఆమే చూచు కుంది. ఇకా వుంటుందా బంగారం? నీకూ ఏదో పెట్టిందిగా అందులో. ఇంకా యెందుకీ ఆరాలన్నీ ఇప్పుడు?

వాజలు. ఏరి వాజలు. తల్లి దగ్గర ముప్పై కాసుల బంగారముంటే ఏంజేస్తా వమ్మా! ఎవరికిస్తావ్? అని ఒక్క మాట అడగలేక, ఇలా నిమ్మకు నీరెత్తినట్టు కూచుంటారేం మనుష్యులు, చచ్చుమొహాలు గాకుంటే. ముగ్గురు కోడండ్లూ విసుక్కున్నారు మనసులోనే. అయినా పైకననూ అంత బాగుండదు గదూ. రోజులు జరిగిపోయినా యలాగే. ఎవరి సంసారం వారిదయింది. సంతానం కలిగింది, పెరిగింది. ఖర్చులూ పెరిగాయి దానితోనే.

అవ్వగారేనాడూ ఏ స్థితిలోనూ ఒడ్డాణం బయటపెట్టలేదు. ''అదొక్కటే మిగిలిందమ్మా చివరకు. ఏమో ఎన్నాళ్ళుంటానో, ఏ స్థితిలో రాలిపోతానో, కడుపున పుట్టిన పిల్లలున్నారు నిజమే. నాకు చేసి వాండ్లెందు కుసూరుమనాలి. ఎవరు చేస్తారో, కాచిపోస్తారో వాండ్లకేయిస్తా. దేవుడూ మెచ్చుతాడు. ఆత్మకూ శాంతి. ఇహమూ పరమూ కూడా.''

కోడండ్లు ముగ్గురు పైకొక్కమాట అనలేదు. కాని పోటీలుపడి చెయ్యసాగారు అత్తగారి పరిచర్య. అన్నట్టే అవ్వ మంచానపడి మూడేండ్లు వేలాడిందలాగే. అయినా ఏ కోడలూ నోరు జారలేదు. పెదవి దాటితే పృథివి దాటుతుంది. తాను విసుక్కున్నట్టు తెలిస్తే, మిగిల్న యిద్దరూ ఆ వార్త అత్తకు జారేస్తే ఇంకేమైనావుందా! ఇంతా చేసి ముగ్గురూ ఒకరిమీద ఒకరు సి.ఐ.డి. లైనారు. ఏనాడూ ఎవరూ ఒక్క పొల్లు మాట అనలేదు అత్తగారిని.

చివరికేలాగైతేనేం ఆ రోజు వచ్చింది. అవ్వగారు కన్నుమూశారు. ''మహరాజు చావు చచ్చింది. ఆ మూడేండ్లూ మంచాన పడ్డదంతే. ఆ బాధంతా అప్పుడే అయింది. చావు మాత్రం. సులభ సూక్ష్మం నిద్రపోయినట్టే. ఎందరి కొస్తుందలాంటి దేవతా చావు. అత్తగారైనా తల్లిలా వుండేది గదూ మాకు. మంచంలో వున్నా, ఎంత నిండు ఇంటికి. ఎంత అండ మాకు.''

ముగ్గురు కోడండ్లూ అత్తనాకాశాని కెత్తేశారు. అవ్వ కూతుండ్లు ముగ్గుర్లో ఇద్దరు దగ్గర వూర్లవాండ్లే. ఒకామె వూళ్ళోనే వున్నది. వార్త అందగానే అందరూ వచ్చి చేరారు.

వేళ పొద్దున పోయింది. సహస్ర మాస జీవి. పండు పండి రాలిపోయింది. అయిన వాండ్లంతా వచ్చారాయె. వైభవంగానే జరిగి పోయింది అవ్వగారి అంతిమయాత్ర.

అన్నట్టింతకూ అవ్వగారెవరికిచ్చారు మువ్వల వడ్డాణం... పరామర్శ కొచ్చినవారికిదీ అసలైన విషయమనిపించింది. అప్పుడందరికీ తోచిందీమాట.. అవునన్నట్టు మువ్వల వడ్డాణం అసలింతకూ లాకర్లో ఎవరిపేర వున్నట్టూ... అని ఆరా వచ్చింది ముందు

అంతవరకూ మౌనంగావున్న పెద్దకూతురు రంగంలోకి వచ్చింది. ఆమె అవ్వగారికి తొలి చూలుబిడ్డ. పిల్లలందర్లోకి పెద్దదేకాదు, తల్లి కెంతో ఇష్టురాలూ. కడుపులోమాట చెప్పకునే దిక్కుకూడానూ ఆమె మెల్లగా అన్నది ... అమ్మకు చదువొచ్చా. సంతకం చెయ్యనొచ్చా. నన్ను బతిమాలితే నేనే వేసివచ్చాను బ్యాంకులో నా పేరటే వున్నదది ...

పెద్ద కొడుకెలాగైనా ఒక తరహా మనిషి అంత కుటిలబుద్ధి కాదతనిది.

మరిహనేం అక్కయ్యా. ముప్పై కాసుల ఒడ్డాణమంటుందెప్పుడూ అమ్మ. ముగ్గు రాడపిల్లలూ, ముగ్గురు కోడండ్లూ తలో అయిదు కాసులూ వస్తాయి తీసుకుంటే సరీ...

కూతుండ్లు పలకలేదు గానీ కోడండ్లు గొణిగారు 'అలా అనలేదు' అత్తయ్యగారెప్పుడూ. ఆడ పిల్లలకిచ్చేదేదో మొదటే ఇచ్చేశాను పేచీ లేదన్నారు. ఇక మిగిలిందీ

మిగిల్న యిద్దరాడపిల్లలూ ముఖాలు నల్లగా పెట్టుకున్నా, పైకేమనలేదుగాని పెద్ద కూతురు మాత్రం ప్రశాంతంగానే. సరే పోనీ ఆమె ఇష్టమెలాగైతే అలాగే చేద్దాం. అన్నది. అన్నదంతే చాలు ఆలస్యమైతే మళ్లీ ఏం గొడవలొస్తాయోనని వెంటనే తెప్పించేశారు ముప్పై కాసుల బంగారం అంతా కలిపి ఒక్కటే నగ. ఈ కాలంలో మధ్యతరగతి కుటుంబాలలో ఎవరిదగ్గరున్నదంత బంగారంతో ఒక్కటే నగ?

అందరూ ఆశ్చర్యంగా చూశారు. మరి ఇదెలా ఎంచటం. మూడు ముక్కలవ్వెయ్యాలా..

''అబ్బే ఇలా ముక్కల్చేస్తే ఏమవుతుంది. వస్తువు సొగసు పోదూ. బాగుంటుందా.''

''పోనీ కావల్సినవారెవరూ ఒకరీసుకుని మిగిల్న ఇద్దరికి చెరో పది కాసుల బంగారమివ్వచ్చు వస్తువూ వుంటుంది. పేచీ వుండదు'' ఈ సూచనైతే బాగుందిగాని ఆచరణ యోగ్యం మాత్రం కాలేదు. ఎవరి దగ్గరుంది? ఇరవై కాసుల బంగారం ఉన్నదనుకో. చిన్నం చితకా అంతా వూడ్చి ఇవ్వాల్సివస్తుంది. అలా యిస్తే వాండ్లకు దక్కేది ఒక్క వడ్డాణం. మెళ్ళోనూలేక, చేతులకూలేక, మరే నగలూ ఎక్కడాలేక, నడుముకో వడ్డాణం. ఛ. ఏం బాగుంటుందనీ ఎవరు చూచినా నవ్విపోతారంతే

''ఏం లాభంలేదు. ఇవేవీ కుదిరే పద్ధతులు కావు. నే చెప్పిందే రైటు. మూడు ముక్కలు చేసి తలో ముక్కో పంచుకోండి'' అందరూ సరే నని తలూపారు.

డా॥ వి. వి. కె. రావ్, B.A.
వైద్య విద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్

వివాహము వాయిదా వేయ నవసరం లేదు. హస్త ప్రయోగం, నరముల బలహీనత, శీఘ్రస్ఖలనములకు ఆయుర్వేద చికిత్స పోస్టుద్వారా చికిత్స కలదు
రావూస్ క్లినిక్
టి. బి. రోడ్, తెనాలి
ఫోన్ . 3700 & 4010

ఇంకా పొడుగు ఎదగండి

2" – 8"
నూతన శాస్త్ర పద్ధతులలో వ్యాయామములతో ఎక్కువ పొడుగుకండి. ఆరోగ్యవంతులు అవండి. స్త్రీ పురుషులకు ఎల్లరకు అనువైనది. దీని వంటి కోర్సు, లేక పుస్తకం మరొకటి ఎంతమాత్రం లేదు. వివరములకు హిందీలోగాని తెలుగులోగాని ఉచితం.
NEW C.T. HOSPITAL
806, Dr. Mukerjee Nagar, Delhi-9.

మీకు బేబి/బాబు కావాలా

ఆపరేషన్ ఇతర వైద్య చికిత్సలతో నిరాశ చెందిన సోదరీమణులు అనేకులు మా సలహాలచే సంతానవతులయి ఇచ్చిన యోగ్యతా పత్రములు గలవు. స్త్రీ పురుష సంధ్యాదోష నివారణా నిపుణులు. * ఉచిత వివరములకు :
శ్రీ నాగార్జున మూలిక కుటీరం,
రామాలయం వీధి, తెనాలి–2. | కవలైను, కేదారేశ్వరపేట, విజయవాడ–3.

చిట్కా

"అసలు ముందు వీరాచార్ని పిలిపించి చూసిద్దాం. దీని విలువెంతో, ఎంత బంగారముందో, ఎంతైనా పాత నగకదా. కొంత కొంతైనా అరిగివుండదా."

వీరాచారి క్షణాలమీద పిలిపించబడ్డాడు. వడ్డాణంవైపు ఎగాదిగా చూశాడు. చేతికి తీసుకుని పరీక్ష చేశాడు. అందరూ ఊపిరి బిగబట్టి చూడసాగారాతని ప్రతిపనీ. చివరకు అటూ ఇటూ ఒకసారి తిప్పి... గీటు పెట్టి చూడమంటారా. . అన్నాడు.

"అదేమిటి వీరాచారీ. ఏమిటనుమానం" వీరాచారి పలక్కుండా గీటుపెట్టాడు.

"నా అనుమానమే నిజం. ఇది నేను చేసిందే, అయిదారేండ్ల కామాలు మామ్మగారు చేయించారు. పద్దెనిమిది తులాల వెండితో చేసి పావుకాసు బంగారం నీరూది యిచ్చాను..." వీరాచారీ వివరిస్తుంటే అందరూ తెల్లబోయి చూచారు.

పెద్ద కోడలు గొంతు పెగల్చుకుని.. నిజంగానేనా. ఇది బంగారం కాదా...

వీరాచారి పెదవి విరిచి గీటుపెట్టిన చోటు చూపించాడు. తెల్లగా మెరుస్తున్నది వెండి. ఎవర్నేమనేట్టు. వీరాచారి వెళ్లిపోగానే పెద్ద కొడుకు విరగబడి నవ్వసాగాడు, అందరూ ఆశ్చర్యంగా చూస్తుంటే. చిన్న కొడుకు అన్నవైపు చూచి అర్థమైనట్టు తనూ నవ్వి... మొత్తానికి ముగ్గురు కోడండ్లకూ భలే టోపీ వేసిందన్నమాట అమ్మ. మువ్వల ఒడ్డాణమో అని తెగ మురిసి చేశారీ మూడేండ్లూ అత్తగారికి చాకిరీ. పూరకగాదు. వంతులు వేసుకుని మరీ పాపం. చివరకు చూస్తే ఇదీ...

"మేమేం మురిసిపోలేదు. ఇస్తానన్నారు గనుక ఎవరికన్నా ఆశ వుంటుందంతే. లేకుంటే మాత్రం మంచానబడ్డ అత్తగారికి చాకిరీ చెయ్యక వదిలేస్తామా ఏం... " పెద్ద కోడలు లోలోపల బాధ పడ్డా పైకి మాత్రం గుంభనగా అన్నది. మిగిల్న ఇద్దరు కోడండ్లూ వంత పలికారు. సొమ్మూ దక్కలేదు. చాకిరీ చేయించుకున్న అత్తగారూ లేదు. ఒకమాట అని కసి తీర్చుకుందామన్నా వీలూ లేదు. ఇకనెందుకు కనవసరంగా నోరు పారేసుకోవటం. కనీసం చేశారన్న కీర్తయినా వుండనీ అనుకున్నారు ముగ్గురూ.

"ఇహనేం వాదులాట ముగిసింది ఆడపిల్లలకు మెట్టెలు పుట్టింటి వారే చేయించాలట అమ్మ అనేదెప్పుడూ. ఒడ్డాణం చెరిపించి ముగ్గురూ మెట్టెలు చేయించుకోండి..." పెద్ద కొడుకు ఆగబడుచులకు సలహా యిచ్చాడు. చిన్న వాండ్లిద్దరే వద్దన్నారు.

"అక్కర్లేదులే అన్నయ్యా. బంగారానికి లేని తెగువతనం ఇప్పుడొచ్చిందా? కోడండ్లనే తీసుకోమను." పెద్దకూతురు మాత్రం వద్దనకుండా అందుకున్నది వడ్డాణం.

"పెద్దదీ, తల్లీనూ. ఆమె వస్తువు తృణమైనా, పణమైనా, మంచిదే గదా." కర్మకాండ లన్నీ ముగిసి ఎవరిండ్లకు వాండ్లు వెళ్లిపోయారు. పెద్దల్లుడు నవ్వుతూ "మీ చెల్లెండ్లిద్దరూ వద్దన్నారు గదా! నీవెందుకు తీసుకున్నావూ? నీవూ ఏదన్నా ప్లాను వేద్దామనుకుంటున్నావా" అని భార్యను జోక్ చేశాడు. ఆమె కూడా నవ్వింది.

"ప్లాను వేసినా ఇక పారదులెండి. రహస్యమందరికీ తెల్సిపోయిందేనాయె ... అవును ఈ ప్లానందరికీ తెల్సిపోయింది. మరొకటి వెతుక్కోవాలి అనుకున్నదామె మనసులో. ఆరేండ్ల కింద మామ్మగారు పెద్దకూతుర్తో తన బాధ చెప్పుకుంది రహస్యంగా" "ఉన్నదంతా వాండ్లకే పెట్టాను కండలు కరిగేట్టు చాకిరీ చేశాను గదా. ఉడిగికూచున్న ముసలిదాన్ని. ఎవరికీ అభిమానం లేదు. ప్రేమగాదు గదా కనీసం జాలన్నా చూపరు. కాస్త తిరుగుతూ నా పనులేగాదు, వాండ్లకూ సాయమవుతున్నాను.

ఇప్పడే ఇట్లా వున్నారు గదా. ఖర్మగాలి మంచానైనా పడితే నాగతేమిటి . కూతురు ఓదార్చింది "ఎందుకే అమ్మా అంత భయం నేనింకా బతికే వున్నాను గదే. నాతోపాటు మాకు కలిగింది కలో, గంజో తాగుదువుగాని రామ్మా, నా దగ్గరకు ..."

అన్నది గాని అమ్మగారి మనసు వప్పలేదు. "ముగ్గురు కొడుకులు, కోడండ్లు, మనవలు, మనవరాండ్లు అందరున్నారు. అల్లుడు యెక్కువైన మనిషే కాదనను. మనసులోనైనా ఏమీ అనుకునేవాడు కాదనుకో. అయినా నా మనసుకే నాకు అనిపిస్తుందలా ..."

ఆలోచించి కూతురు సలహా యిచ్చింది. "నేను కొత్తగా కాపరానికి వెళ్లేటప్పుడు నీవిచ్చిన వెండి గ్లాసు, నీ పుట్టింటివారు నీకిచ్చిందని చెప్పావు, గుర్తుందా. నీ జ్ఞాపకార్థం దాచుకున్నాను. ఎన్ని పాట్లుబడ్డా మార్చకుండా. ఇరవై తులాలన్నావు. కనీసం పద్దెనిమిదన్నా వుండకుండా వుండదు. నీ వేలికున్న ఉంగరం ఏ నాటిదో. పాతిక్కాసైనా వుండదూ! ఏం చేద్దామంటే..." తల్లి చెవులో రహస్యం చెప్పటమే గాదు, చేయించిన మువ్వల వడ్డాణం బ్యాంకు లాకర్లో పడవేసి వచ్చింది కూతురు రెండో చెవికి వార్త అందకుండా.

"అమ్మ ప్రేమ అంత గాఢమైంది కనకే మళ్లీ అందరూ వద్దన్నారు. నా వస్తువు నాకే వచ్చింది ఏ రూపంలోనైతేం..." అనుకున్నదామె మనసులో తల్లి మెదిలి కండ్లు తడి అవుతుంటే. ★